క్లుప్తంగా

పట్టుదలతో విద్య అభ్యసించాలి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ రాజా

పెద్దాపురం: ప్రతి విద్యార్థి పట్టుదలతో విద్య అభ్యసించాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మిరియాల రాజా అన్నారు. మండలంలోని మర్లావ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఆయన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న విద్యా వసతులను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. పట్టుదల, క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకుని, తద్వారా తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తేవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నట్టల నివారణ మందుల పంపిణీ

సామర్లకోట: మండల పశు వైద్య కేంద్రంలో గురువారం ఉదయం నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తారని పశు సంవర్ధక శాఖ ఏడీ ప్రమీల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గొర్రెలు, మేకల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గొర్రెలు, మేకల్లో ఈ వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్న కారణంగా, ముందుగా వ్యాధి నియంత్రణకు నట్టల నివారణ మందు వేయించాలని సూచించారు. కాపరులు వారి గొర్రెల మందలను ఆస్పత్రికి తీసుకురావాలన్నారు.

భారీ వర్షం

కొత్తపల్లి: మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో జన జీవనం స్తంభించింది. పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్‌లో ఇరువైపులా ఉన్న డ్రైన్లు ఆక్రమణకు గురికావడంతో మోకాల్లోతు నీరు నిలిచిపోయింది. ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో పలుచోట్ల నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

పథకాలు ఇవ్వాలి.. లేకుంటే జీతాలు పెంచాలి

- మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక కుటుంబాల డిమాండ్



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు

బోట్‌క్లబ్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ చేపట్టిన సమ్మె బుధవారం 50వ రోజుకు చేరింది. స్మార్ట్ సిటీ కార్యాలయం వద్ద కాకినాడలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తమ కుటుంబ సభ్యులతో సహా రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, తమకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల పిల్లలు మీడియాతో మాట్లాడుతూ, 50 రోజులుగా తమ తల్లిదండ్రులు జీతాలను పెంచాలని కోరుతూ సమ్మె చేస్తున్నా కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం చాలా దారుణమన్నారు. చాలీచాలని జీతాలతో తమ ఇళ్లు గడవడం లేదన్నారు. నెలకు రూ.13 వేలతో ఇంటి అవసరాలు కూడా పూర్తిగా తీరడం లేదన్నారు. తమ స్కూల్ ఫీజులు ఎవరు కడతారని వారు ప్రశ్నించారు. జీతాలు తక్కువగా ఇచ్చి, ప్రభుత్వ పథకాలు ఇవ్వకుండా చేయడం ఈ ప్రభుత్వానికి తగదన్నారు. అందరికీ ఇచ్చేలా రూ.27 వేలకు జీతం పెంచాలని కోరారు. ఆధార్ కార్డు స్టేటస్ చూడగానే తమ తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులుగా కనబడుతుందని, అందువల్ల వారిని రెగ్యులర్ ఎంప్లాయిస్‌గా పరిగణించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు శ్రీధర్ మాట్లాడుతూ, తమ సమస్యను సీఎం, డిప్యూటీ సీఎం, మున్సిపల్, విద్యా శాఖల మంత్రుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై అవగాహన

కాకినాడ రూరల్: కోర్టు వివాదాల సత్వర పరిష్కారానికి వేదిక లోక్ అదాలత్ అని, కక్షిదారులు దీనిని సద్వినియోగం చేసుకుంటే శ్రేయస్కరమని న్యాయవాది యనమల రామం అన్నారు. బోట్‌క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంతాలు పట్టింపులకు పోయి కేసులు పెట్టుకుని, ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. అటువంటి వారు రాజీమార్గంలో లోక్ అదాలత్‌ల ద్వారా లబ్ధి పొందవచ్చని తెలిపారు. వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్నప్రసాద్, కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, చింతపల్లి సుబ్బారావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

లెక్క చేయరా..?

- పవన్ కల్యాణ్ లాగే మమ్మల్నీ ప్రజలు ఎన్నుకున్నారు
- ఆయన నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులకు విలువ లేదా..?
- మండల పరిషత్ సమావేశాన్ని బహిష్కరించిన పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు
- అధికారుల గైర్హాజరే కారణం



పిఠాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎలా ప్రజల నుంచి ఎన్నుకోబడ్డారో.. తామూ అలాగే ప్రజల నుంచి ఎన్నుకోబడ్డామని, కానీ ఆయన నియోజకవర్గంలో పాలకులకు విలువ లేకుండా పోయిందని పలువురు ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి 30 మంది అధికారులు రావాల్సి ఉండగా, కేవలం పది మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశాన్ని బహిష్కరించారు.

అవమానించడమే..

ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులుగా ప్రజల సమస్యలను తీర్చడం కోసం అధికారులతో సమీక్షించడానికి అన్ని పనులు మానుకుని తాము వస్తే, బాధ్యత కలిగిన అధికారులు రాకపోవడం తమను అవమానించడమేనన్నారు. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల పరిషత్ సమావేశానికి అధికారులు రాకపోవడం చూస్తుంటే, ప్రజాప్రతినిధులంటే అధికారులకు ఎంత చులకనగా ఉందో అవగతమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులంటే అధికారులకు లెక్క లేకుండా పోయిందన్నారు. ప్రజలతో ఎన్నుకోబడిన తాము ఉత్సవ విగ్రహాలుగా మారామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు రాకపోతే ఇక తాము ఎవరితో చర్చించి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలంటూ ప్రశ్నించారు.

ఎవరికి చెప్పాలి..?

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్నా.. ఇప్పటి వరకు పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఒక్కసారి కూడా సమావేశాలకు రాలేదని సభ్యులు గుర్తు చేశారు. ఇక తాము ఎవరికి సమస్యలు చెప్పుకోవాలో వారే చెప్పాలన్నారు. ఇప్పటి వరకు ఎన్నుకోబడిన ప్రతి ఎమ్మెల్యే, ఎంపీలు పలు సమావేశాలకు హాజరై.. తాము చెప్పే సమస్యలు ఆలకించి, సానుకూలంగా స్పందించేవారని, కానీ ఇప్పుడు ఎవరూ కానరావడం లేదన్నారు. గ్రామాల్లో కూటమి నేతలే ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతున్నారని, వారికి ఇష్టమొచ్చినట్లుగా రోడ్లు వేసుకుంటున్నారని తెలిపారు. కనీసం సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు సమాచారం కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రొటోకాల్ అనేది కూటమి ప్రభుత్వంలో కనిపించకుండా పోయిందన్నారు.

ఒక్క పనీ కాలేదు

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గతంలో నియోజకవర్గంలోని సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించి, గ్రామాల్లో చేయాల్సిన పనులు, కావాల్సిన మౌలిక సదుపాయాల లిస్టు ఇవ్వమని అడిగారన్నారు. ఆయన ఎంతో అభివృద్ధి చేస్తారని తామంతా గ్రామ సమస్యలను తీర్మానాలు చేసి ఇస్తే ఏడాదైనా ఒక్క పనీ చేయలేదన్నారు. మూడు నెలల క్రితమే 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైతే ఇప్పటి వరకు గ్రామ పంచాయతీలకు ఒక్క పైసా కూడా రాలేదని, ఇలాగైతే తాము పంచాయతీలను ఎలా నడపగలమో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గ ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తమ సమస్యలపై దృష్టి పెట్టి, ప్రజాప్రతినిధులకు విలువ ఉండేలా చూడాలని కోరారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు వెంటనే విడుదల చేయాలని సర్పంచ్‌లు డిమాండ్ చేశారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

సామర్లకోట: పెద్దాపురం శతాబ్ది పార్కు ఎదురుగా ఉన్న సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ వైర్లపై ఉన్న చెట్టు కొమ్మల కట్టింగ్ కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఏఈఎన్‌డీఎస్ ప్రభాకర్ బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. కొత్తపేట, వ్యాపారపు పుంత, సినిమా సెంటర్, గౌరీ కొనేరు, ఆర్బీపట్నం రోడ్డు, శివాలయం వీధి, సుబ్బయ్యపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని చెప్పారు.

ఆలయాల్లో పూజలు

సామర్లకోట: పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లోని పలు ఆలయాల్లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బుధవారం పూజలు చేశారు. స్థానిక కోట్లమ్మ చెరువు సమీపంలో వారాహి అమ్మవారిని, ఆంజనేయస్వామిని, సాయిబాబాను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం పెద్దాపురంలోని శివాల యంలో కాలభైరవ స్వామికి పూజలు చేశారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, కౌన్సిలర్ పిల్లాడి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి కాలువ గట్టును పరిరక్షించాలి

- అధికారులకు రైతుల వినతి



గోదావరి కాలువ గట్టు తవ్విన ప్రదేశం

సామర్లకోట: ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకున్న సామర్లకోట గోదావరి కాలువను పరిరక్షించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. గోదావరి కాలువ కింద వేలాది ఎకరాల ఆయకట్టు సాగవుతుందని, వేలాది మంది రైతులు ఆధారపడి ఉన్నారని చెప్పారు. మాండవ్య నారాయణ స్వామి ఆలయం సమీపంలోని గోదావరి కాలువ గట్టును ఇటీవల తవ్వకం చేశారన్నారు. దీని కారణంగా గోదావరి కాలువ గట్టు బలహీన పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. వరదల సమయాల్లో గోదావరి కాలువ గట్టు కోతకు గురైతే, వేలాది ఎకరాల పంట ముంపునకు గురి కావడమే కాకుండా, పొలాల్లోని మకాంల్లో ఉండే పశువులు వరదకు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. గోదావరి కాలువ గట్టులో తన భూమి ఉందనే సాకుతో ఓ రైతు గట్టును తవ్వకం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గోదావరి కాలువ గట్టు సమీపంలో రెవెన్యూ పొరంబోకు స్థలం కూడా ఉన్నట్లు పూర్వీకుల ద్వారా తెలిసిందని తెలిపారు. రైతులకు ఉపయోగపడే గోదావరి కాలువను పరిరక్షించాల్సిన ఇరిగేషన్ అధికారులు మౌనంగా ఉండటం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి, గోదావరి గట్టును పటిష్టం చేయాలని కోరారు. రైతులకు న్యాయం జరగకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళతామని రైతులు తెలిపారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ, బిక్కవోలు ఇరిగేషన్ అధికారి దృష్టికి సమస్యను తీసుకు వెళతామని చెప్పారు. రైతుల ఫిర్యాదు మేరకు గోదావరి కాలువ గట్టును పరిశీలిస్తామన్నారు. దళితులకు చెట్టు-పట్టా పథకంలో ఇచ్చిన కొబ్బరి చెట్లను తొలగించారని కౌన్సిలర్ నేతల హరిబాబు ఆరోపించారు.

నిరుపయోగంగా జనరేటర్

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

సామర్లకోట: పట్టణంలోని పిఠాపురం రోడ్డులో ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయంలో జనరేటర్ ఎండా వానల్లో నిరుపయోగంగా పడి ఉంది. పిఠాపురం రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఎంపీడీఓ కార్యాలయంలోకి, అక్కడి నుంచి బలుసులపేట అల్లూరి సీతారామరాజు పార్కు వద్దకు మార్పు చేశారు. అయితే జనరేటర్‌ను పాత తహసీల్దార్ కార్యాలయం వద్దే వదిలేశారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లకు విద్యుత్ లేని సమయంలో ఉపయోగించేలా 15 ఏళ్ల క్రితం ఈ జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ జనరేటర్ మరమ్మతులకు గురి కావడంతో నిరుపయోగంగా వదిలేశారు. దాంతో జనరేటర్ పూర్తిగా పాడై, పాత ఇనుముగా మారిపోతోంది. వీడియో కాన్ఫరెన్స్‌ల కోసం తహసీల్దార్ కార్యాలయంలో యూపీఎస్‌లను ఏర్పాటు చేశారు. దాంతో జనరేటర్‌ను నిర్లక్ష్యంగా మూలన విడిచిపెట్టేశారు. పాత తహసీల్దార్ కార్యాలయానికి రక్షణ లేకపోవడంతో రాత్రివేళల్లో ఆకతాయిలు కార్యాలయ ఆవరణలో మద్యం సేవించడంతో పాటు, జనరేటర్‌లో విలువైన బ్యాటరీ వంటి సామగ్రి గల్లంతు చేశారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజాధనంతో కొనుగోలు చేసిన ఆస్తులను అధికారులు రక్షించాల్సి ఉండగా, వాటిపై కనీస శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, జనరేటర్‌ను వినియోగంలోకి తేవాలని, లేకపోతే వేలం వేసి ప్రజాధనాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పాత తహసీల్దార్ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న జనరేటర్

ప్రాణసంకటంగా విద్యుత్ తీగలు

- రక్షణ కల్పించాలని మహిళల వినతి
- పరిశీలించిన అధికారులు

సామర్లకోట: సుమారు 20 ఏళ్లుగా ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్న తమకు విద్యుత్ వైర్లు ప్రాణసంకటంగా మారాయని బ్రౌన్‌పేటలోని కందానికి చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం మహిళలు ఏపీఈపీడీసీఎల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ వైర్లు ఇళ్ల మీదుగా ఉండటం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని మార్పు చేయాలని మహిళలు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే అనేక పర్యాయాలు వినతిపత్రాలు సమర్పించినా, వైర్లు మార్పు చేస్తామని హామీ ఇస్తున్నారు మినహా పనులు జరగడం లేదని వాపోయారు. బ్రౌన్‌పేట నుంచి రోడ్డు మార్జిన్‌లో ఉన్న విద్యుత్ స్తంభాలు మార్పు చేసి, తమ ఇళ్ల మీదుగా ఉన్న వైర్లను మార్పు చేయాలని మహిళలు సూచించారు. ఈ క్రమంలో ట్రాన్స్‌కో ఏడీఈ కిరణ్, ఏఈ రమేష్ కుమార్‌లు కందం వద్దకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. వర్షాలు వచ్చిన సమయంలోను, ఈదురు గాలులు సమయంలోను ప్రమాదాలు జరుగుతున్నాయని మహిళలు వాపోయారు. సాధ్యమైనంత త్వరలో వైర్లు మార్పు చేస్తామని ఏడీఈ వారికి హామీ ఇచ్చారు. విద్యుత్ వైర్లు ఎవరి ఇళ్ల మీదుగా వెళుతున్నాయో ఏఈ నమోదు చేసుకున్నారు. అధికారుల వెంట కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ, ఆ ప్రాంత నాయకుడు అందుగుల వీర్రాజు, కందం ప్రాంతవాసులు బులిపే పల్లయ్యమ్మ, కొల్లి కుమారి, ధనలక్ష్మి, గొల్లపల్లి వీరన్న, రమణమ్మ, లక్ష్మి తదితరులు ఉన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఏడీఈ

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

సామర్లకోట: అన్ని రంగాల్లో గ్రామాల అభివృద్ధికి మహిళా సర్పంచ్‌లు కృషి చేయాలని విస్తరణ శిక్షణా కేంద్రం(ఈటీసీ) వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ అన్నారు. సర్పంచ్‌లకు ఆటపాటలతో కూడిన శిక్షణ నిర్వహించడం వల్ల ప్రతి విషయం దీర్ఘకాలం గుర్తుంటుందని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లాలోని సర్పంచ్‌లకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు ప్రతి విషయం తెలుసుకోవాలనే ఆలోచనతో శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. మార్పు ద్వారా విజేతలు, మహిళా సాధికారతతో స్వపరిపాలన అనే అంశంపై శిక్షణ కొనసాగిందన్నారు. పంచాయతీరాజ్ చట్టం నిర్దేశించిన నిబంధనల ప్రకారం నెలవారీ పంచాయతీ సమావేశాలను నిర్వహించాలన్నారు. అదే విధంగా కార్యాచరణ కమిటీల సమావేశాన్ని నిర్వహించడం ద్వారా గ్రామాల్లోని సమస్యలు తెలుసుకోవడానికి వీలవుతుందన్నారు. పంచాయతీ సమావేశాలు నిర్వహించే సమయంలో సభ్యులందరికీ సకాలంలో తెలియజేయాల్సి ఉంటుందని చెప్పారు. అనేక పంచాయతీల్లో సభ్యులతో సంతకాలు చేయించుకుని, సమావేశాలు నిర్వహించడం లేదన్నారు. గ్రామాల్లో నిర్ణీత తేదీల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి, సర్పంచ్‌లు అధ్యక్షత వహించాల్సి ఉంటుందని తెలిపారు. వివాదాలు లేకుండా, ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. శిక్షణ ముగింపు సందర్భంగా సర్పంచ్‌లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ కె.సుశీల, ఫ్యాకల్టీలు ఎస్ఎస్ శర్మ, కేఆర్ నిహారిక, ఎం చక్రపాణిరావు, ఎ.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్‌లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వైస్ ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీలు

జెడ్పీ బంగ్లాలో బ్లైండ్ హోం ప్రారంభం

కాకినాడ సిటీ: అతి ముఖ్యమైన ప్రాంతంలో బ్లైండ్ హోమ్ ఏర్పాటు చేయడం ద్వారా వారికి ఏ అవసరం ఉన్నా పది నిమిషాల్లో సాయం చేసేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. స్థానిక కర్లంగారి జంక్షన్ సమీపంలో ఆధునీకరించిన జెడ్పీ సీఈవో భవనాన్ని బ్లైండ్ హోమ్‌కు కేటాయించారు. బుధవారం దీనిని ప్రారంభించిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మంచి ప్రదేశంలో బ్లైండ్ హోమ్‌కు భవనాన్ని కేటాయించిన జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, జెడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావును అభినందించారు. ఈ బిల్డింగ్‌ను ఆధునీకరించడానికి ఆర్థిక సాయం చేసిన మాజీ ఐఏఎస్ అధికారి చల్లా భీమేశ్వరరావు సతీమణి నిర్మలమ్మకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 1958 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారి చల్లా భీమేశ్వరరావు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎన్నో చేశారని కొనియాడారు. ఈ బ్లైండ్ హోమ్‌కు సీఎస్సార్ నిధులతో కోరమండల్ ఫెర్టిలైజర్స్ మంచాలు, బెడ్లు, దిండ్లు, ట్రంకు పెట్టెలు (బాక్సులు) సమకూర్చారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ భవనంలో ఐదు ఏసీల అవసరం ఉందని, వాటిని కూడా కోరమండల్ ఫెర్టిలైజర్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. భవనంలో 47 మంది ఉంటారని, వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తారని తెలిపారు. మాజీ ఐఏఎస్ అధికారి చల్లా భీమేశ్వరరావు మాట్లాడుతూ, విజువల్ ఇంపెడ్‌కు ఈ భవనాన్ని ఆధునీకరించి ఇచ్చే అవకాశం కల్పించినందుకు కలెక్టర్ షణ్మోహన్‌కు ధన్యవాదాలు తెలిపారు. తన మనశ్శాంతి కోసం ఈ కార్యక్రమం చేశానన్నారు. కార్యక్రమానికి వచ్చిన అంధుల కష్టసుఖాలను తెలుసుకున్నారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ, అంధులకు ఈ భవనం కేటాయించాలని సంకల్పించిన కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాకినాడ నగరానికి మధ్యలో ఈ భవనం ఉందని, అన్నింటికీ అనుకూలమైన ప్రాంతమన్నారు. రానున్న రోజుల్లో ఈ భవనాన్ని ఇంకా అభివృద్ధి చేసి, మరిన్ని సౌకర్యాలు కల్పిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, డీఆర్వో జె.వెంకటరావు, రెడ్‌క్రాస్ సంస్థ రాష్ట్ర సెక్రటరీ వైడీ రామారావు, జెడ్పీ డిప్యూటీ సీఈవో జీఎస్ రామ్ గోపాల్, కోరమండల్ ఫెర్టిలైజర్స్ సీఎస్సార్ సీనియర్ మేనేజర్ పి.వంశీకృష్ణ, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ వై.శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డి.రామసుబ్రహ్మణ్యం, ఉమా ఎడ్యుకేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

గడువులోగా భూ సమస్యలపై చర్యలు

కాకినాడ సిటీ: రెవెన్యూ కార్యకలాపాలపై సిబ్బంది నిర్ణీత గడువులో చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఎస్ మల్లిబాబు తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం ఆయన కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి సర్వే చేయాలని, సీనియర్ సిటిజన్ కేసుల్లో ఉత్తర్వులు అమలు జరిగేటట్లు చూడాలన్నారు. రీ సర్వేకు సంబంధించి నిర్ణీత గడువులో దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ పనుల నేపథ్యంలో కౌలు రుణఅర్హత కార్డులు మంజూరు చేయాలని చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖల భూములకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. సూర్యఘర్ పథకానికి సంబంధించి భూములు గుర్తించాలన్నారు. అదే విధంగా ఆర్‌వోఆర్ కేసులు, నీటితీరువా వసూళ్లు, రేషన్ కార్డు దరఖాస్తులు, జాతీయ రహదారుల భూసేకరణ, అభ్యంతరాలు లేని భూ ముల క్రమబద్ధీకరణకు సంబంధించి ఫ్రీ హోల్డ్ గ్రామ స్థాయిలో, మండల స్థాయిలో రెవెన్యూ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. రీ సర్వేలో వచ్చే దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఈనాం ఎస్టేట్ ఎబోలిషన్ యాక్ట్ పీఓటీ రికార్డు ఆఫ్ రైట్ భూ ఆక్రమణ కేసుల్లో, వెబ్‌ల్యాండ్ తదితర రెవెన్యూ అంశాల్లో ఎప్పటికప్పుడు సమీక్షించి, నిర్ణీత గడువులో చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆదేశించారు.

ఇలాగైతే సాగునా..!

- పూడుకుపోయిన పంట కాలువలు
- కాలువ నిండా పిచ్చిమొక్కలు
- ఆందోళనలో అన్నదాతలు

కొత్తపల్లి: మండలంలో ఎక్కడ చూసినా ప్రధాన కాలువలు పూడుకుపోయాయి. సాగుకు రైతులు సమాయత్తం కావాలని చెబుతున్న అధికారులు ఇప్పటి వరకు కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో ఈ ఏడాది సాగు సాధ్యమేనా అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. మండలంలో ఏ కాలువ చూసినా పూడికలతో దర్శనమిస్తున్నాయి. అక్కడక్కడా తూతూమంత్రంగా పూడికను తొలగిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలో 6,073 మంది రైతులు 10,254 ఎకరాల్లో సాగు చేస్తున్నారని వ్యవసాయాధికారుల అంచనా. కాలువల నిండా చెట్లు, పిచ్చి మొక్కలు నిండి, కొన్నిచోట్ల మట్టి పొరలు పేరుకుపోయి ఉన్నాయి. మదుములు, షట్ట ర్ల పరిస్థితి దారుణంగా ఉంది. కాలువ పనులు పూర్తి స్థాయిలో చేపట్టకుండా, రూ.లక్షలు వెచ్చించి నామమాత్రంగానే చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇరిగేషన్ అధికారులు ఏనాడూ కాలువల పూడికలను పట్టించుకోలేదని రైతులు చెబుతున్నారు. శివారు భూమలకు సాగునీరు వెళ్లాలంటే, ప్రారంభంలో నీటి దుర్వినియోగాన్ని అరికట్టాల్సి ఉంటుంది. వర్షాలు సకాలంలో పడకపోతే రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పొలాలు ఎండిపోయే పరిస్థితి ఉత్పన్నమవుతుంది. ప్రస్తుతం వర్షాలు అనుకూలిస్తేనే విత్తనాలు చల్లేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. అలాగే నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, కాలువల్లో పూడికలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.



అమీనాబాద్‌లో పూడుకుపోయిన కాలువ



వాకతిప్పలో ఇలా..



కుతుకుడుమిల్లి కాలువలో పిచ్చి మొక్కలు



యండపల్లిలో కాలువ దుస్థితి

వనదుర్గమ్మకు ప్రత్యంగిర హోమం



అమ్మవారికి ప్రత్యంగిర హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి దుర్గామాతగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి జ్యేష్ఠ అమావాస్య పర్వదినం సందర్భంగా బుధవారం ఘనంగా ప్రత్యంగిర హోమం నిర్వహించారు. 11 గంటలకు వేదపండితులు యనమంద్ర శర్మ ఘనపాఠీ, గంగాధరబట్ల గంగబాబు, అర్చకులు దత్తాత్రేయశర్మ, కోట వంశీ పండితుల ఆధ్వర్యంలో హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు, ప్రసాదాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.